సాక్షి నిజామాబాద్


మంగళవారం । 11 । మార్చి । 2025



ప్రజావాణికి 95 ఫిర్యాదులు

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
38.9 /18.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీపీవోగా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ



సుభాష్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా శ్రీనివాస్‌రావు సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలోనే శ్రీనివాస్‌రావు బదిలీ ఉత్తర్వులు వెలువడినప్పటికీ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు నిర్వర్తించిన శ్రీనివాస్ నిజామాబాద్ డీఎల్‌పీవోగా కొనసాగనున్నారు. అలాగే బోధన్ డీఎల్‌పీవోగా నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఆయన బాన్సువాడ నుంచి బోధన్‌కు బదిలీపై వచ్చారు.

13 నుంచి రైల్వే గేటు మూసివేత

నవీపేట: మండలంలోని ధర్మారం(ఏ) రైల్వే గేటును ఈనెల 13 నుంచి మూసివేయనున్నట్లు రైల్వే ఇంజినీర్ రవి ప్రకాశ్ సోమవారం తెలిపారు. అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

అల్జాపూర్ శివారులో చిరుత సంచారం



నవీపేట: మండలంలోని అల్జాపూర్–యంచ గ్రామాల మధ్య చెరువు కట్టపై సోమవారం చిరుత కనిపించడంతో రెండు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రైతులకు చిరుత కనిపించడంతో వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. నిజామాబాద్ బీట్ ఆఫీసర్ సుధీర్, సెక్షన్ ఆఫీసర్ జెహ్రూ చెరువు ప్రాంతంలో పర్యటించి ఆనవాళ్లను సేకరించారు. పాదముద్రలు చిరుతవేనని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

సీఐల బదిలీలు

ఖలీల్‌వాడి: మల్టీ జోన్–1 పరిధిలో 114 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీకి అటాచ్‌గా ఉన్న రవికుమార్‌ను సీసీఎస్ నిజామాబాద్‌కు, జి.వెంకటయ్య పీసీఆర్ కామారెడ్డి నుంచి ఎస్‌బీ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. కాగా, రెండు, మూడు రోజుల్లో కొత్త సీఐలు బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇంటర్ పరీక్షలకు 417 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. మొత్తం 16,297 మంది విద్యార్థులకు 15,880 మంది హాజరుకాగా, 417 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఇంటర్ బోర్డు పరీక్షల విభాగం నుంచి విశ్వేశ్వర్ బృందం పలు సెంటర్లను తనిఖీ చేసి సమీక్షించింది.

ధర్మపురి జాతరకు ప్రత్యేక బస్సులు

- మహిళలకు ఉచిత ప్రయాణం

ఆర్మూర్‌టౌన్: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ధర్మపురి జాతరను పురస్కరించుకొని టీజీఎస్ ఆర్టీసీ ఆర్మూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు మేనేజర్ రవీందర్ తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 వరకు ఆర్మూర్ నుంచి ధర్మపురికి ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేశామన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణమని, పురుషులకు రూ. 220, పిల్లలకు రూ.120 టికెట్ ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చెత్త సేకరించేందుకు ఆర్మూర్ బల్దియా కొనుగోలు చేసిన ఆటోలు

చెత్తబండ్లు



ఆర్మూర్ మున్సిపాలిటీలో ట్రాక్టర్లు, ట్రాలీలు

- బల్దియాలకు భారంగా పారిశుధ్య నిర్వహణ
- మూలనపడిన చెత్త సేకరణ వాహనాలు
- రిపేర్లకు ప్రతి నెలా రూ.లక్షల ఖర్చు
- వాహనాలకు రూ.కోట్లు వెచ్చించినా దక్కని ఫలితం
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్త
- జిల్లాలోని మున్సిపాలిటీల వాహనాలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

జిల్లా కేంద్రమైన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలకు చెత్త సేకరణ వాహనాల నిర్వహణ భారంగా మారింది. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాల రిపేర్లకు లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. సగానికిపైగా వాహనాలు మూలకు చేరాయి. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో వాహనాల రిపేర్లకు నెలకు ఏకంగా రూ.20లక్షల వరకు ఖర్చు చేస్తుండడం గమనార్హం. వాహనాలు రోజూ రాకపోవడంతో ప్రజలు కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారవేస్తున్నారు.

సాక్షి గ్రౌండ్‌రిపోర్ట్

మూలకు చేరిన 14 ఆటోలు

- బోధన్‌లో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ
- రెండు, మూడు రోజులకోసారి చెత్త సేకరణ



బోధన్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మూలనపడి ఉన్న ఆటోలు

బోధన్ టౌన్ : బోధన్ మున్సిపాలిటీ పరిధిలో రెండుమూడు రోజులకోసారి చెత్త సేకరిస్తుండడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో 38 వార్డులు, లక్షలకు పైగా జనాభా ఉంది. పారిశుధ్య విభాగంలో 182 మంది కార్మికులు పనిచేస్తున్నారు. 38 వార్డులను ఎనిమిది జోన్‌లుగా విభజించి పనులు నిర్వహిస్తున్నారు. చెత్త సేకరించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి 24 ఆటోలు, ఏడు ట్రాక్టర్లు, ఒక స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేశారు. 38 వార్డుల్లో నుంచి ప్రతి రోజూ 35 మెట్రిక్ టన్నుల చెత్త సేకరించాల్సి ఉండగా గడిచిన 4 నెలలుగా 50 శాతం చెత్తను మాత్రమే సేకరిస్తున్నారు. మొత్తం 24 ఆటోల్లో నుంచి 10 మాత్రమే పనిచేస్తుండగా 14 మూలనపడ్డాయి. స్వీపింగ్ మిషన్ సైతం పని చేయడం లేదు.

అదనపు కలెక్టర్ వచ్చినా..

గత 10 రోజుల క్రితం అదనపు జిల్లా కలెక్టర్ అంకిత్ బోధన్ బల్దియాను సందర్శించారు. పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. మున్సిపల్ వాహనాల కండీషన్, మరమ్మతులకు సంబంధించి నివేదిక అందించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

భీమ్‌గల్‌లో మితంగానే ఖర్చులు



మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు మూడు ట్రాక్టర్లు, రెండు ట్రాలీ ఆటోలను వినియోగిస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న భీమ్‌గల్ పట్టణాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. అప్‌గ్రేడ్ కాక ముందే చెత్త సేకరణ కోసం రెండు ట్రాక్టర్లను వినియోగించారు. జీపీ నిధులతోనే వీటిని కొనుగోలు చేయడం గమనార్హం. మున్సిపాలిటీగా మారిన తరువాత మరో ట్రాక్టర్‌తోపాటు మూడు ట్రాలీ ఆటోలను కొనుగోలు చేశారు. ఒక ఆటో రిపేర్ చేయించాల్సి ఉంది. ప్రస్తుతానికి మూడు ట్రాక్టర్లు, రెండు ట్రాలీ ఆటోలతో చెత్త సేకరిస్తున్నారు.

40 మోటార్లు..

మిషన్ భగీరథ నీరు ఇంటింటికి అందక ముందు 40 మోటార్లతో నీటి సరఫరాను కొనసాగించారు. ఇంటింటికి నీరు సరఫరా అవుతుండటంతో కేవలం ఆరు మోటార్లను అత్యవసర పరిస్థితుల్లో వినియోగిస్తున్నారు. మరో ఆరు చేతి పంపులు అక్కడక్కడ ఉన్నాయి. వీటిని మున్సిపాలిటీ నిధులతోనే నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మున్సిపాలిటీ అధికారులు భావిస్తున్నారు.

36 వార్డులు.. 22 ఆటోలు

- ఏడాదికి రూ.3.50 లక్షలకు పైగా ఖర్చు
- అయినా ఆర్మూర్‌లో చెత్త సేకరణకు తప్పని తిప్పలు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులు, వాటి పరిధిలోని కాలనీల్లో చెత్త సేకరణకు సరిపడా వాహనాలు లేకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కొరత కారణంగా కొత్త ఆటోల కొనుగోలుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. గతంలో 25 ఆటోలు కొనుగోలు చేయగా 22 మాత్రమే పని చేస్తున్నాయి. తొమ్మిది ట్రాలీ ట్రాక్టర్లు, ఒక జేసీబీ, రెండు బ్లేడ్ ట్రాక్టర్లు ఉన్నాయి. అయితే ఒక బ్లేడ్ ట్రాక్టర్ మాత్రమే పని చేస్తోంది. రోడ్లను శుభ్రపరిచేందుకు స్వీపింగ్ మిషన్ అందుబాటులో ఉంది. విలీన గ్రామాలైన పెర్కిట్–కొటార్మూర్, మామిడిపల్లి శివారు కాలనీల్లోకి చెత్త సేకరించే ఆటోలు రాకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. ఆయా కాలనీల్లో పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందుల సంచారం పెరిగింది. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పట్టణ ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

మరమ్మతులకు భారీ ఖర్చు

2023–24లో ఆటోలు, ట్రాక్టర్ల మరమ్మతుల కోసం రూ.3 లక్షల 25 వేలు ఖర్చు చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియక ముందే ఇప్పటి వరకు రూ.3.79 లక్షల వరకు ఖర్చు చేశారు. పియాజియో ఆటోల ఆటోల నిర్వహణ మున్సిపల్ అధికారులకు తల నొప్పిగా మారింది. సర్వీసింగ్ సెంటర్లు అందుబాటులో లేకపోవడంతో ఖర్చు మరింత పెరుగుతోంది.

నెలకు రూ.20లక్షలకు పైగా..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాలు, వాటి నిర్వహణ బల్దియాకు భారంగా మారింది. కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ 300 మెట్రిక్ టన్నుల చెత్త జమవుతున్నాయి. చెత్త సేకరణకు మొత్తం 137 వాహనాలు ఉండగా, వాటిలో 68 టాటా ఏస్‌లు, 34 ట్రాక్టర్లు, తొమ్మిది ఐచర్లు, మూడు కంప్రెషర్‌లు, మరో మూడు స్వీపింగ్ మిషన్లు ఉన్నాయి. మిగతా 20 వాహనాలను స్క్రాప్‌కు పంపించాలని ఆర్టీఏ అధికారులు బల్దియాకు నోటీసులు ఇచ్చారు. పలు కాలనీలకు మున్సిపల్ వాహనాలు వెళ్లకపోవడంతో చెత్త పేరుకుపోతోంది.



వృథాగా షెడ్‌లో ఉన్న వాహనాలు

తలకు మించిన భారం.. పెద్ద వాహనాలు

బల్దియాకు 12 పెద్ద వాహనాలు ఉన్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేశారు. వాటి ద్వారా చేసే పనులతో పోలిస్తే డీజిల్ మెయింటెనెన్స్ తడిసిమోపెడవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.లక్షల్లో ఖర్చు

గత పాలకవర్గం కమీషన్ల కోసం బల్దియాకు నాసిరకం వాహనాలు కొనుగోలు చేసిందనే చర్చ విస్తృతంగా సాగింది. ఈ అవకాశాన్ని అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాటి మరమ్మతులు, నిర్వహణ పేరుతో లక్షలాది రూపాయలు బిల్లులు చేస్తున్నారు. ప్రతినెలా రూ.20లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు.

తరచూ మరమ్మతులు

అనుభవం ఉన్న డ్రైవర్లు, మంచి రోడ్లున్నప్పటికీ చెత్త సేకరణ వాహనాలు తరచూ రిపేర్లకు వెళ్తున్నాయి. రిపేర్ల పేరుతో ప్రతినెలా భారీగా బిల్లులు పెడుతున్నారు. వాటిని పరిశీలించకుండానే బిల్లులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాహనాల మరమ్మతుల పేరుతో పెద్ద ఎత్తున నిధులు దారి మళ్లుతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు, సిబ్బంది వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా తతంగం కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు.

వాహనాల కొనుగోలు లేనట్లే..

శానిటేషన్‌కోసం వినియోగించే వాహనాలు తరచూ రిపేర్‌కు వస్తున్నాయి. వెంటనే రిపేర్లు చేయించకుండా జాప్యం చేస్తే చెత్త తరలింపు ఆలస్యమవుతుంది. ఇప్పటికే కొన్ని వాహనాలు మూలనపడ్డాయి. ఇప్పట్లో కొత్త వాహనాల కొనుగోలు లేనట్లే.

– సాల్మన్ రాజు, మున్సిపల్ వెహికిల్స్ ఇన్‌చార్జి

చివరాయకట్టు వరకు నీరందించాలి

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- వీసీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్, తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: చేతికొచ్చిన పంటలను కాపాడడం ప్రభుత్వ కర్తవ్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి విషయంలో నీటిపారుదల శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు వాస్తవాలను వివరించాలని సూచించారు. సోమవారం సాయంత్రం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంతికుమారితో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మరో 15 రోజుల్లో పంటలు చేతికి రానున్నందున అధికారులు సమన్వయంతో రైతాంగానికి తోడ్పాటు నందించాలని సూచించారు. చివ రాయకట్టు వరకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో నిజనిజాలు తెలుసుకోకుండా పంట నష్టంపై జరుగుతున్న ప్రచారం సత్య దూరమన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకుంటాం

జిల్లాలో యాసంగి పంటల పరిస్థితిని నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ప్రధానంగా వరి పంట కోసం చివరి ఆయకట్టు వరకు సాగు నీరందేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 4.19 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారని మంత్రుల దృష్టికి తెచ్చారు. 2.38లక్షల ఎకరాలు చెరువులు, కాలువల కింద సాగు చేయడంతో ఎలాంటి ఇబ్బందుల్లేవని తెలిపారు. బోరుబావులపై ఆధారపడి మరో లక్షా 80వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారని, భూగర్భ జలాలు కొంతమేర తగ్గడంతో భీమ్‌గల్, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, మోపాల్ మండలాల్లో సుమారు 1100 ఎకరాలకు సాగునీటి కొరత నెలకొందని అన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీటిని అందించి పంటలు కాపాడుకునేలా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటామని అన్నారు. వీసీలో సీపీ సాయి చైతన్య, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పసుపు రైతులు

- నిజామాబాద్ మార్కెట్‌లో పంట కొనుగోలు చేయాలని ధర్నా
- అంతర్జాతీయ మార్కెట్‌లో ధర తగ్గడంతో కొనడానికి ముందుకు రాని వ్యాపారులు
- నగరంలోని బస్టాండ్ ఎదుట రైతుల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం..
- వ్యాపారులు, రైతులతో అధికారులు జరిపిన చర్చలు సఫలం
- నేటి నుంచి యథావిధిగా మార్కెట్‌లో పసుపు కొనుగోళ్లు



బస్టాండ్ వద్ద రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపుతున్న పసుపు రైతులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు కొనడం లేదని రైతులు రోడ్డెక్కారు. ప్రధాన బస్టాండ్ ఎదుట ధర్నాకు దిగారు. సోమవారం శ్రద్ధానంద్ గంజ్‌కు 39 వేల బస్తాల పసుపు వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసుపు ధర తగ్గడంతో పంట కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. మధ్యాహ్నం కావస్తున్నా వ్యాపారులు ధర కోడ్ చేయడానికి రాకపోవడంతో రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పసుపును ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులు, సిబ్బందిని నిలదీయగా, వారి నుంచి సరైన సమాధానం రాలేదు. కోపోద్రిక్తులైన రైతులు మార్కెట్‌యార్డు నుంచి ర్యాలీగా నగరంలోని ప్రధాన బస్టాండ్ వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. సుమారు గంటకుపైగా ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

■ అంతర్జాతీయ మార్కెట్‌లో 45 రోజుల క్రితం పసుపు ధర క్వింటాలుకు రూ.15,200 ఉండగా, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిజామాబాద్ మార్కెట్ కమిటీ క్వింటాలుకు కటాఫ్ ధర రూ.10 వేలుగా నిర్ణయించింది. ఈ మేరకు కొనుగోళ్లు జరిగేవి. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో కొన్నిరోజులుగా పసుపు ధర తగ్గుతూ ప్రస్తుతం క్వింటాలుకు రూ.11,500 పలికింది. మార్కెట్ కమిటీ నిర్ణయించిన కటాఫ్ ధర తగ్గించాలని వ్యాపారులు కోరారు. రైతుల సంక్షేమం దృష్ట్యా కటాఫ్ ధర తగ్గించేందుకు మార్కెట్ కమిటీ అంగీకరించలేదు. దీంతో రైతులు తీసుకొచ్చిన పంటకు వ్యాపారులు ధర కోడ్ చేయడానికి ముందుకు రాలేదు. రైతులు ఆందోళన చెంది ధర్నాకు దిగారు.

రైతులతో చర్చలు..

ధర్నా విరమించిన అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజా వెంకట రెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ, డీఎంవో గంగు సమక్షంలో వ్యాపారులు, రైతులతో మార్కెట్ కమిటీ కార్యాలయంలో చర్చలు జరిపారు. అంతర్జాతీయంగా ధర తగ్గిందని కటాఫ్ ధర తగ్గించాలని వ్యాపారులు అధికారులతో పేర్కొన్నారు. ధర తగ్గిస్తే ఊరుకోబోమని, మద్దతు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు జోక్యం చేసుకుని కటాఫ్ ధరను పసుపు కాడికి రూ.9,500, గోలకు రూ.8 వేలుగా వ్యాపారులు, రైతుల సమక్షంలో నిర్ణయించారు. అందరూ సమ్మతం తెలపడంతో చర్చలు సఫలమయ్యాయి.

అదనపు కలెక్టర్ హామీతో విరమణ



ప్రధాన బస్టాండ్ ఎదుట రైతుల ధర్నా విషయం తెలుసుకున్న ఏసీపీ రాజా వెంకట రెడ్డి అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. మార్కెట్‌యార్డులో వ్యాపారులు సిండికేట్ అయ్యారని, పసుపు ధర తగ్గిస్తున్నారని, పంటను కొనడం లేదని రైతులు ఆరోపించారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకూ ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ వచ్చి హామీనివ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.



మార్కెట్‌యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

ఎండిన పసుపు తేవాలి..

రైతుల సంక్షేమానికి మార్కెటింగ్ శాఖ, ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతులు పచ్చి పసుపు తీసుకురావొద్దు. ఎండిన పసుపు తెచ్చి మంచి ధర పొందాలి. కొందరు రైతులు పచ్చి పసుపు తేవడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులు, వ్యాపారులు, అధికారుల సమక్షంలో జరిపిన చర్చలు సఫలీకృతమయ్యాయి. మంగళవారం నుంచి యథావిధిగా పసుపు క్రయవిక్రయాలు జరుగుతాయి.

– ముప్ప గంగారెడ్డి, చైర్మన్

రాజీ పడేదేలే..

- మహిళల భద్రతకు పెద్దపీట
- డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ కట్టడికి ప్రత్యేక ప్రణాళిక
- లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు ప్రాధాన్యత
- నూతన సీపీ పోతరాజు సాయిచైతన్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ సాయిచైతన్య



విలేకరులతో మాట్లాడుతున్న సీపీ

ఖలీల్‌వాడి: శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో రాజీపడేదే లేదని నూతన పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్య అన్నారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా విధులు నిర్వర్తించి బదిలీపై వచ్చిన సాయిచైతన్య సోమవారం జిల్లా కేంద్రంలోని కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను వినియోగించుకోవాలని, పోలీసుశాఖ ఎల్లప్పుడూ ప్రజాసేవలో ఉంటుందని పేర్కొన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని, డ్రగ్స్, బెట్టింగ్ కట్టడికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. యువత డ్రగ్స్, బెట్టింగ్‌కు అలవాటుపడి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. నార్కోటిక్ విభాగంలో పని చేసిన తనకు డ్రగ్స్ కట్టడిపై అవగాహన ఉందన్నారు. గతంలో ఐదుసార్లు నిజామాబాద్‌కు వచ్చానని తెలిపారు. అల్ప్రాజోలం, డైజోఫామ్ వంటి మత్తు పదార్థులు జిల్లాలో కొనసాగుతున్నట్లు తన దృష్టిలో ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారు అనే తేడాలేకుండా సైబర మోసాలబారిన పడి అమాయకులు మోసపోతున్నారని, సైబర్ నేరాల నివారణకు పోలీసుశాఖ తరఫున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

పంటలకు సాగునీరందించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి



సుభాష్‌నగర్: జిల్లాలో భూగర్భజలాలు అడుగంటి సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని, కాలువల కింద ఉన్న పంటలకు తక్షణమే నీరందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు లేఖ రాశారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, మోపాల్, డిచ్‌పల్లి మండలాల్లో బోరుమోటార్లు ఎత్తిపోయి వరి ఎండిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. మెట్ట ప్రాంతాల్లోని రైతులకు ట్యాంకర్ల ద్వారా, కాలువల కింద ఉన్న పంటలకు సాగునీరు అందించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మోసగించిన యువకుడి రిమాండ్

దోమకొండ: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన కేసులో దోమకొండకు చెందిన యువకుడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. సదరు యువతిని ప్రేమిస్తున్నానంటూ పెళ్లి చేసుకొని లైంగిక దాడికి పాల్పడి వదిలివేసినట్లు పేర్కొన్నారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి యువకుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

బాధితులకు న్యాయం చేయండి



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో అక్షర ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌తో మోసపోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో బాధితులు మాట్లాడారు. సదరు ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం రాష్ట్రవ్యాప్తంగా 72 బ్రాంచీలు పెట్టి మూడు వేల మందిని మోసగించి కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. జిల్లా బ్రాంచ్‌లో 72మంది బాధితులకు రూ. 2కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా, ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ



మాక్లూర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో డీఆర్డీవో సాయాగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. గతేడాది ఉపాధి హామీ పనులు ఏ మేరకు జరిగాయి, ఏఏ పనులు చేశారనే రికార్డులను తనిఖీ చేశారు. కూలీలకు డబ్బులు చెల్లించటంలో ఆలస్యం జరిగిందా జరిగితే ఎందుకు జరిగిందనే వివరాలను ఎఫ్ఏలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండల వ్యాప్తంగా కొన్ని గ్రామ పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిగింది. ఇక ముందు చేపట్టే పనులు ఇతర అంశాలపై ఏపీవో ఓంకార్‌కు డీఆర్డీవో సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, సుశీల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 95 ఫిర్యాదులు

- సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాలు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఏసీపీ శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్‌లకు వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మా గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని ఆంధ్రానగర్ గ్రామానికి చెందిన అంకమ చౌదరి అనే వ్యక్తి కబ్జా చేశాడు. అతనికి సొంత భూమి రెండు ఎకరాలు మాత్రమే ఉండగా ప్రభుత్వ భూమితోపాటు గుత్ప లిఫ్ట్ కెనాల్ భూమిని కబ్జా చేశారు. చౌదరికి తహసీల్దార్ సహకరిస్తున్నారు.



వెంటనే ప్రభుత్వ భూమిని కాపాడాలి.

– అయిలాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ

రైతుభరోసా రాలేదు..



నాకు రైతు భరోసా రావడం లేదు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. స్థానిక అధికారులను కలిస్తే డబ్బులు రాలేదు, రాగానే ఇస్తామని చెబుతున్నారు. కానీ ఇంతవరకు ఇవ్వడం లేదు. మా గ్రామంలోని ఇతర రైతులకు రైతుభరోసా వచ్చింది. నాకు మాత్రం రాలేదు. – సత్యాగౌడ్, సిర్‌పూర్

ఉద్యోగం ఇప్పించండి



నేను దివ్యాంగున్ని. డిగ్రీ పూర్తి చేశాను. ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తే జీవనోపాధి కలుగుతుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలోనూ దరఖాస్తు చేసుకున్నాను.

– రమేశ్, కులాస్‌పూర్

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి

నాకు ఇల్లు లేదు. ఉపాధి లేదు. అద్దె ఇంట్లో పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాను. నాకు సొంత స్థలం ఉంది. ఇదివరకే అధికారులు వచ్చి పరిశీలించారు. కానీ, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించండి.

– సనాఫాతిమా, నందిపేట

నా ప్లాట్‌ను కబ్జా చేశారు

ఆర్మూర్‌లోని సర్వే నంబర్.208లోని నాకు ప్లాట్ ఉంది. ఐకేపీలో ఉద్యోగం చేసే నా భర్త గతేడాది మరణించాడు. నా భర్త జీవించి ఉన్నప్పుడు అతనిని తాగుడికి బానిస చేసి రామకృష్ణ అనే వ్యక్తి అక్రమంగా మా ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. డబ్బులు కూడా ఇవ్వలేదు. అధికారులు స్పందించి ప్లాట్‌ను ఇప్పించాలి. – చెంచు మంగళి, ఆర్మూర్

సీఐపై చర్యలు తీసుకోవాలి



ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ జాతరకు వెళ్లిన నా భార్య పర్సు పోయింది. అక్కడే పోలీసు అవుట్‌పోస్టులో ఫిర్యాదుచేయగా బందోబస్తులో ఉన్న సీఐ విజయ్‌బాబు బూతులు తిడుతూ నా భార్యను లాఠీతో కొట్టాడు. ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు సీఐపై చర్యలు తీసుకోలేదు. – స్వామి, దూపల్లి, రెంజల్

‘నవోదయ’ ఏర్పాటు చేయండి



నవోదయ విద్యాలయాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు విన్నవించారు. జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయ ఏర్పాటులో జాప్యం చేయొద్దని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు రాజకీయం చేస్తున్నాయని పేర్కొన్నారు.

రేషన్‌కార్డు మంజూరు చేయండి



నాకు రేషన్‌కార్డు కావాలని స్థానిక అధికారులను కలిసి దరఖాస్తు చేసుకున్నాను. మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పగా అక్కడా దరఖాస్తు చేశాను. కానీ ఇంత వరకు రేషన్‌కార్డు మంజూరు కాలేదు.

– లావణ్య, కులాస్‌పూర్, మోపాల్ మండలం

కలెక్టర్‌ను కలిసిన సీపీ, డీపీవో





కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ సాయిచైతన్య, డీపీవో శ్రీనివాస్‌రావు

నూతన సీపీగా బాధ్యతలు చేపట్టిన పి.సాయి చైతన్య, డీపీవోగా వచ్చిన శ్రీనివాస్‌రావు సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

– నిజామాబాద్ అర్బన్/సుభాష్‌నగర్

మనిషి ఆలోచనలో మార్పురావాలి

తెయూ (డిచ్‌పల్లి): మనిషి జీవితంలో విజయం సాధించాలంటే తన ఆలోచన విధానంలో మార్పురావాలని యూనివర్సిటీ ఆఫ్ టెక్నిక్స్ ప్రొఫెసర్, అకడమిక్ ఎడ్యుకేషన్ అడ్వయిజర్ డాక్టర్ గడ్డం వాణి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో సోమవారం విద్యార్థుల ఆలోచనలు– అవకాశాలు అనే అంశంపై కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ అధ్యక్షతన విస్తృతోపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గడ్డం వాణి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే నిరంతర అధ్యయనం, బహుముఖ విజయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపజయాలు ఎదురైనప్పుడు అనుభవాలను గుణపాఠాలుగా మార్చుకొని, విజయం కోసం ముందడుగు వేయాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో లా కాలేజ్ ప్రిన్సిపల్ ప్రసన్న రాణి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ నాగరాజు, చీఫ్ వార్డెన్ మహేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డం వాణి

రాత్రికి రాత్రే ఇసుక తోడేస్తున్నారు

- పోతంగల్, రెంజల్ పరిధిలోని మంజీరా పరీవాహకంలో తవ్వకాలు
- అక్రమంగా టిప్పర్‌లలో తరలింపు
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ, ఆర్టీఏ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ఖలీల్‌వాడి: మంజీర పరీవాహకంలో ఇసుక మాఫియాకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. రాత్రివేళ పొక్లెయినర్లు, ట్రాక్టర్ లోడర్స్‌తో ఇసుక తోడేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ. లక్షల్లో గండిపడుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టేవారు మూడు గ్రూపులుగా మారి తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఒక గ్రూపు అధికారులను మచ్చిక చేసుకుంటుండగా, మరో గ్రూపు మంజీరా పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వించి టిప్పర్‌లలో పంపిస్తారు. మూడో గ్రూపు ఇసుక టిప్పర్లకు ఎస్కార్ట్‌గా మారి ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని అక్రమంగా ఇసుక తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, ఆర్టీఏ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



సోమవారం ఉదయం ఇసుకను తరలిస్తున్న టిప్పర్

సామర్థ్యానికి మించి తరలింపు..

పోతంగల్ మండలం కల్లూర్, కొడిచర్ల, పోతంగల్, హంగార్గా, సుంకిని, రెంజల్ మండలంలోని నీలా, కందకుర్తి ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్నారు. మంజీరా పరీవాహక ప్రాంతంలో కొందరు ఇంటిపనుల కోసం ఇసుకను తరలిస్తుండగా, మరికొందరు ప్రభుత్వ కార్యక్రమాలకు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇక్కడి నుంచి తరలించిన ఇసుకను డంప్‌లుగా చేసుకుంటున్నారు. అనంతరం అక్కడి నుంచి టిప్పర్‌లలో సామర్థ్యానికి మించి తీసుకెళ్తున్నారు. రాత్రివేళలో ఇసుక అక్రమదందా కొనసాగుతుందని తెలిసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇసుక టిప్పర్లతో ప్రమాదాలు జరిగినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

వే బిల్లులు లేకుండానే..

ఇసుక తరలింపునకు సంబంధిత టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులు మీ సేవల్లో దరఖాస్తు చేసుకొని వాటికి చలాన్ కట్టాల్సి ఉంటుంది. అనంతరం జారీ అయిన వే బిల్లుతో ప్రభుత్వం కేటాయించిన రీచ్ నుంచి ఇసుకను తీసుకువెళ్లాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతి ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటి నిబంధనలు ఉండవు. రాత్రివేళల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంప్ చేస్తారు. అనంతరం అక్కడి నుంచి టిప్పర్‌లలో నిజామాబాద్, బోధన్ వంటి ప్రాంతాలకు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇలా తరలించిన ఇసుకకు ఎలాంటి వే బిల్లులు ఉండవు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలి

వే బిల్లు లేకుండానే రాత్రివేళ టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. రెవెన్యూ, పోలీసులు, మైనింగ్, ఆర్టీఏ అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఇసుక అక్రమ రవాణాను అరికట్టవచ్చు. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి రాత్రివేళల్లో తనిఖీ చేపట్టాలి.

– లింగారెడ్డి, నిజామాబాద్ లారీ ఓనర్స్, బిల్డింగ్ మెటీరియల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

అంకాపూర్‌లో కడప వ్యవసాయాధికారులు

- పంటలను పరిశీలించిన బృందం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం సందర్శించారు. వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఏ నాగేశ్వర్ రావు, డ్వామా పీడీ బీ ఆదిశేషా రెడ్డి, ఉద్యావన శాఖ జిల్లా అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి తదితరులు అంకాపూర్‌లో సాగు చేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పసుపు ఉడకబెట్టే యంత్రాలు, సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, నీటి నిలువ తొట్టెలను పరిశీలించి రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ పీడీ ఎం వెంకటేశ్వర్ రెడ్డి, డీపీఎం ప్రవీణ్, ఆర్మూర్ ఏడీఏ విజయలక్ష్మి, ఏఈవో అనూష, అంకాపూర్ రైతులు సల్ల అనంత్ రెడ్డి, నారాయణ రెడ్డి, కేకే భాజన్న, జీ భూమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పసుపు ఉడకబెట్టే యంత్రాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు



అంకాపూర్ సందర్శనకు వచ్చిన వరంగల్ రైతులు

వరంగల్ రైతులు..

పెర్కిట్(ఆర్మూర్): వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురం, గిర్ల కనిపర్తితోపాటు శాయంపేట మండలానికి చెందిన రైతులు అంకాపూర్ గ్రామాన్ని సోమవారం సందర్శించారు. రైతు విజ్ఞానయాత్రలో భాగంగా నాబార్డు సహకారంతో శాంతది సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అంకాపూర్‌లో పర్యటించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి: పాల్వంచ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. భవానీపేట తండాకు చెందిన బూక్య సురేశ్, మాలోత్ తేజ పాల్వంచ నుంచి కామారెడ్డి వైపు బైకుపై వెళుతుండగా, వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఆటో దొంగ అరెస్ట్



ఖలీల్‌వాడి: జీజీహెచ్‌లో ఆటో చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామానికి చెందిన అమృత్వార్ మోహన్ తన చిన్నమ్మ డెలివరీ కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఈ నెల 5న రాత్రి 10 గంటలకు తన ఆటోను జీజీహెచ్ పార్కింగ్ ఏరియాలో నిలిపాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి ఆటో కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నగరంలోని బోధన్ బస్టాండ్‌లోని వాహనాల తనిఖీ చేస్తుండగా బర్కత్‌పురాకు చెందిన ఖలీద్ బిన్ మొహమ్మద్‌పై అనుమానంతో విచారించగా చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. ఆటోను స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఆర్మీ జవాన్ మృతి



ప్రమోద్ భౌతికకాయానికి సెల్యూట్ చేస్తున్న అధికారి

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ కాసుల ప్రమోద్ ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 1న హైదరాబాద్‌లోని తన గదిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రమోద్‌కు తీవ్రగాయాలయ్యాయి. మొదట సికింద్రాబాద్ ఆర్మీ ఆస్పత్రిలో చేర్పించగా, మెరుగైన చికిత్స కోసం పుణెలోని మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 8న రాత్రి మృతి చెందాడు. ప్రమోద్ స్వగ్రామం సిరికొండలో సోమవారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమోద్ భౌతికకాయానికి ఆర్మీ అధికారులతోపాటు సిరికొండ ఎస్సై ఎల్ రామ్ నివాళులర్పించారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు చెల్లెలు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య



వెంకటేశ్ గౌడ్ (ఫైల్)

బాల్కొండ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మెండోరా మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన చంద్రగిరి వెంకటేశ్‌గౌడ్(39) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్‌గౌడ్ ఆరు నెలల క్రితం దుబాయి నుంచి ఇంటికి వచ్చి గీత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బతుకుదెరువు కోసం గతంలో మూడుసార్లు దుబాయి వెళ్లగా అక్కడ సరైన పని లభించక తిరిగి వచ్చాడు. దుబాయి వెళ్లినప్పుడల్లా అప్పు చేసి ఏజెంట్లకు డబ్బులు చెల్లించాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఆదివారం వెంకటేశ్‌గౌడ్ భార్య శ్రావణి పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తాడ్‌బిలోలిలో మరొకరు..

రెంజల్(బోధన్): అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సాకినిగారి పోశెట్టి(55) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గత నెల 22న ఇంటి నుంచి వెళ్లిన పోశెట్టి కనిపించకపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశారు. సోమవారం స్థానిక చెరువులో మృతదేహం కనిపించడంతో జాలర్లతో బయటకు తీయించారు. అక్కడే శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముషీర్‌నగర్‌లో యువకుడు..



మనోహర్ (ఫైల్)

సిరికొండ: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ముషీర్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్ రామ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బట్టు మనోహర్(24) ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై ఈ నెల 7న పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మనోహర్ ఈ నెల 9న రాత్రి మృతి చెందినట్లు ఎస్సై రామ్ సోమవారం తెలిపారు. మృతుడి భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రెండిళ్లలో చోరీ

బాన్సువాడ : బాన్సువాడ పట్టణం సంగమేశ్వర కాలనీలో ఆదివారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన దుబాస్ రాములు శుక్రవారం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో ఇంటికి తాళం వేసి కోటగిరి వెళ్లాడు. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు 5 తులాల వెండి, దేవుడి చిత్రపటం వద్ద ఉన్న రూ.5 నాణేలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో రాములు పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. ఇదే కాలనీలో ఉండే కాశమణి ఆదివారం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లగా దుండగులు చోరీకి పాల్పడ్డారు. తులం 4 మాసాల బంగారం చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.



దుండగులు పగులగొట్టిన ఇంటి గొళ్లెం

ప్రతిపాదిత స్థలాలు ఫైనలయ్యేనా?

- సమీకృత గురుకులాలకు నిధులు కేటాయించిన సర్కారు
- స్థల కేటాయింపు ప్రతిపాదనలు పంపిన కలెక్టర్
- రెండు చోట్ల వేరే స్థలాలను సూచిస్తున్న అధికార పార్టీ నేతలు

ఆర్మూర్: జిల్లాలో మూడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో ఈ సమీకృత గురుకులాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టర్ పరిశీలించిన స్థలాలు సమీకృత స్కూళ్ల నిర్మాణానికి ఫైనల్ అవుతాయా? అనేది చర్చనీయాంశమైంది. ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనుండగా, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు రెండు నెలల క్రితం పలు స్థలాలను ప్రతిపాదించారు. ఆర్మూర్ నియోజకవర్గానికి మంజూరైన స్కూల్‌ను అంకాపూర్ శివారులోని 493/1 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి విజ్ఞప్తి చేయగా, కలెక్టర్ ప్రతిపాదనలు పంపారు. మరో రెండింటిని నవీపేట్ మండలం దర్యాపూర్, డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామశివార్లలో నిర్మించాలని కలెక్టర్ ప్రతిపాదనలు పంపారు. అయితే అధికార పార్టీ నాయకులు రెండు చోట్ల వేరే స్థలాలను సూచించడంతో కలెక్టర్ వాటిని సైతం పరిశీలిస్తున్నారు. ఆర్మూర్ పట్టణ శివారులోని పిప్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతం, బోధన్ మండలం బెలాల్ గ్రామ శివారులోని మధుమలంచ డిగ్రీ కళాశాల స్థలంలో సమీకృత గురుకులాలను నిర్మించాలని అధికార పార్టీ నాయకులు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా విద్యార్థులు, తల్లిదండ్రులు సులభంగా పాఠశాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం ఉన్న చోటే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి ఎస్పీ బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి క్రైం : జిల్లా ఎస్పీగా నియమితులైన రాజేశ్ చంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్పీగా పని చేసిన సింధు శర్మ హైదరాబాద్ ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో రాజేశ్ చంద్ర వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనను జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వివాహిత అదృశ్యం

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని బాలానగర్‌కు చెందిన కొమిరె పోసాని అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పోసాని ఈ నెల 9న మునిపల్లిలోని మేనత్త బత్తుల పోసాని వద్ద ఉన్న తన కుమారుడు నర్సింహను తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. పోసాని బావ కొమిరె రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆచూకీ తెలిస్తే జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.